
# కళ్యాణ కట్ట



## పులిచెర్ల సాంబశివరావు

"చూడండి వెంకట్రావు గారూ! నాకు సంబందాలు తీసుకు రావద్దు ఈ విషయం మీకు లోగడ లక్ష సార్లు చెప్పాను ఇప్పుడు చివరి సారిగా చెబుతున్నాను ఈ సారి మరో సంబంధం తెచ్చారంటే మీ మర్యాద దక్కదు!"

శ్రీనివాస్ ఇలా కఠినంగా అనేసరికి వెంకట్రావు తెల్లబోయాడు

వెంకట్రావు లెక్చరర్‌గా పరువు మర్యాదలతో బ్రతుకుతున్న పెద్దమనిషి శ్రీనివాస్ తండ్రి సుబ్బారాయుడికి బాల్యమిత్రుడు

శ్రీనివాస్‌కి ముప్పయి అయిదేళ్ళు దాటాయి తలిదండ్రులు ఎంత మొత్తుకున్నా పెళ్ళికి ఒప్పుకోవడం లేదు కారణం చెప్పడు

సుబ్బారాయుడు కోరికపై వెంకట్రావు అనేక సంబంధాలు తెచ్చాడు శ్రీనివాస్ అన్నిటినీ తిరస్కరించాడు మొదట్లో ఏవో వంకలు చెప్పి తప్పించుకునే వాడు ఇప్పుడు అసలు పెళ్ళే వద్దంటున్నాడు దీంతో శ్రీనివాస్ తలిదండ్రులు దిగులు పడ్డారు

శ్రీనివాస్‌కి అన్నీ మంచి అలవాట్లే! కాఫీ అలవాటు లేదు సిగరెట్ అంటే చిరాకు మద్యం అంటే మంట బ్యాంకులో తన పనేమో తనేమో!

సాయంత్రం సంగీత సాధన చేస్తూ ఉంటాడు రాత్రి రంగనాయక స్వామివారి కోవెలలో కోగంటి సీతారామాచార్యుల వారి పురాణాన్ని భక్తి శ్రద్ధలతో వింటాడు తెల్లవారు జామునే లేచి ఘంటసాల స్టైయిల్‌తో భగవద్గీత పఠిస్తాడు

రోజు రోజుకీ శ్రీనివాస్‌లో భక్తి ముదిరిపోయింది ఇందుకు ఆరంభంలో ఆనందించిన తలిదండ్రులు ఇప్పుడు అధికంగా ఆందోళన చెందుతున్నారు

సరేనండీ! దేవుడి మీద భక్తి ఉండాలిసిందే! కాదనము కానీ అది పిచ్చిగా మారగూడదు ఏ వయసులో జరగాలిసిన ముచ్చట ఆ వయసులో జరిగితేనే బాగుంటుంది ఇప్పుడు భజనలతో కాలం గడిపి, రిటైరయిన తరువాత పెళ్ళి చేసుకుని ఏం చేస్తాడు? "చిఛీ! వీడి వలన మా అందరికీ తలవంపులుగా ఉంది మా వాడు పెళ్ళి వద్దనడానికి కారణం ఏమిటో ననినలుగురూ నాలుగు విధాల గుసగుసలు పోతున్నారు అని సుబ్బారాయుడు అప్తుల దగ్గర వాపోతున్నాడు ఇక శ్రీనివాస్ తల్లి బాధ వర్ణనాతీతం ఆడపిల్లలిద్దరికీ పెళ్ళి చేసి పదేళ్ళు దాటింది ఒక్కగానొక్క కుమారుడు వాడు వంశోద్ధారకు డవ్వాలనీ, ఇల్లు మనవళ్ళతో, మనుమరాళ్ళతో కళకళ లాడుతూ ఉండాలనీ ఆమె కోరిక

శ్రీనివాస్ ఎవరి మాటా వినటం లేదు తల్లి కన్నీళ్ళు అతని మనసును కరిగించలేక పోతున్నాయి

ఏవండీ! మన వాడి పెళ్ళి మానవ మాత్రులు ఎవరూ చేయలేరేమోనండీ! శాంతమ్మ భర్తతో అన్నది

అవునే! నేనూ అదే నిర్ణయానికి వచ్చాను! సుబ్బారాయుడు శూన్యంలోకి చూస్తూ అన్నాడు

ఇక ఆ దేవుడే వాడి పెళ్ళి చేయాలి! శాంతమ్మ గోడకు తగిలించిన వెంకటేశ్వరస్వామి కేలండరు చూస్తూ అన్నది

'అవును! ఆ స్వామి దయ వలన జన్మించాడని మనం వాడికి శ్రీనివాసు అని పేరు పెట్టుకున్నాం ఇక ఆ ఏడుకొండల వాడే మన వాడికి కల్యాణం చేయాలి!

అంతా ఆ స్వామికే కల్యాణం చేయాలని కోరుకుంటుంటారు మనం మాత్రం ఆ స్వామే మన వాడి కల్యాణం చేయాలని కోరుకుంటున్నాం ఎంత విడ్డూరం!

తప్పదే! ఆ స్వామికి దయ రావాలే గాని సాధ్యం కానిదేముంది? ఇవాళే మనం అబ్బాయితో కలిసి పోయి ఏడుకొండల వాడిని దర్శిద్దాం ఇక ఆ తరువాత ఆ కలియుగేశునిదే భారం అంతా!

లేడికి లేచిందే పరుగన్నట్లు సుబ్బారాయుడు వెంటనే ప్రయాణం ఏర్పాట్లు ప్రారంభించాడు తిరుపతికి పోతున్న సంగతి తెలిసి శ్రీనివాస్ ఎగిరి గంతేశాడు

అహా! ఎంత అదృష్టం! తన కొండకు తనే రప్పించుకుంటున్నాడు నామాలస్వామి అంతా దైవ లీల! భక్తి పారవశ్యం వలన శ్రీనివాస్ శరీరం

గగుర్పొడిచింది

నాన్నా! నాదో చిన్న కోరిక!

ఎన్నడూ ఏ కోరికా కోరని వాడు ఇప్పుడిలా అనడంతో సుబ్బారాయుడు ఆశ్చర్యంతో చూశాడు

దారిలో శ్రీకాళహస్తి ఉంది ఆ స్వామిని సేవించుకొని తరువాత తిరుపతి పోదాం!

ఆఖరికి ఇదన్నమాట అబ్బాయి గారి కోరిక!

సుబ్బారాయుడు తల ఊపాడు

మరుసటి రోజు ఉదయమే శ్రీకాళహస్తి చేరుకున్నారు శ్రీనివాస్ శ్రీకాళహస్తి నాథుని లీలలు స్మరించి పులకిత గాత్రుడయ్యాడు

బస్సులో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి చేరుకున్నారు కాలి నడకనే తిరుమల చేరాలని శ్రీనివాస్ పట్టుపట్టడంతో చేసేది లేక సుబ్బారాయుడు సరేనన్నాడు

పరమ పవిత్రమైన తిరుమల కాలి బాటలోని ప్రతి మెట్టునూ భక్తితో తాకి శ్రీనివాస్ కొండ మీదికి ఎక్కుతున్నాడు మధ్య మధ్యలో తలిదండ్రులకు చేయూత నిస్తున్నాడు

తల్లి నడవలేకపోతూంది

కాసేపు ఆగుదాం బాబూ! అన్నది శ్రీనివాస్ ఒక చెట్టు నీడన తల్లిని కూర్చోబెట్టాడు

సుబ్బారాయుడికి దప్పిక వేస్తోంది

ఇంతలో ఆ చెట్టు క్రిందికి వేరే కుటుంబం వచ్చి చేరింది

భార్యా భర్త కుమార్తె – ఆ కుటుంబ సభ్యులు

ఆ అమ్మాయికి ముప్పయ్యేళ్ళుంటాయి పసుపు పచ్చని ఛాయ తలపై జుత్తు నల్లగా ఒత్తుగా నిగనిగలాడుతూ వుంది ముఖంలో ఒక దివ్య సౌందర్యం ప్రస్ఫుటమవుతూంది ఆమె ఉనికి వలన ఆ ప్రదేశానికే నూతన శోభ వచ్చి పడింది

పద్మా! కొంచెం మంచినీళ్ళు ఇవ్వు తల్లీ! ఆమె తల్లి అడిగింది

ఆమె కోమల హస్తాలతో మర చెంబు మూత తీసి గ్లాసులో నీళ్ళు పోసి తల్లికిచ్చింది

చాలా అమ్మా!

ఆమె కంఠం వేయి వీణలు మీటినట్లు మృదు మధురంగా వినబడింది

శ్రీనివాస్ ఆ తియ్యటి గొంతు విని, ఒక్క క్షణం ఆమె వైపు చూచి, మళ్ళా తిరుమలేశుని ధ్యానంలో లీనమై పోయాడు

అమ్మాయ్! నాక్కూడా కొంచెం మంచి నీళ్ళు ఇస్తావా తల్లీ! సుబ్బారాయుడు ఆమెను అడిగాడు

ఆమె ఒక్క క్షణం తటపటాయించి తలిదండ్రుల వైపు చూచింది వాళ్ళు కళ్ళతోనే అంగీకారాన్ని తెలిపారు ఆమె గ్లాసు నిండా నీళ్ళు వంచి సుబ్బారాయుడి కందించింది ఆయన తృప్తిగా వాటిని తాగి భార్య వైపు చూశాడు

శాంతమ్మ నాక్కూడా కొంచెం ఇవ్వు తల్లీ! అన్నది ఆమె ఇంకో గ్లాసు నీళ్ళు ఇచ్చింది

శాంతమ్మ గ్లాసు తిరిగి యిస్తూ పిల్లా పాపలతో

# కళ్యాణ కట్ట

చల్లగా నూరేళ్ళు వర్ధిల్లు తల్లీ అని దీవించింది ఈ దీవన వినగానే ఆ యువతి తల్లి 'మాకు అంత అదృష్టమా అన్నది బాధగా

ఏమమ్మా? అన్నది శాంతమ్మ ఆశ్చర్యంగా

మా అమ్మాయి పెండ్లి చేసుకోనని మంకు పట్టు పట్టింది అని ఆమె ఏమో చెప్పబోతూ ఉండగా ఆ యువతి అమ్మా! అని చిరుకోపంతో తల్లి వైపు చూచి వారించింది దాంతో ఆమె మాట మార్చి ఏ వూరు మీది? అని శాంతమ్మను ప్రశ్నించింది ఇద్దరూ ఊర్లూ పేర్లూ చెప్పుకొని మరి కాసేపట్లో ఆత్మీయంగా మాట్లాడుకోసాగారు

మళ్ళా ప్రయాణం సాగించారు మాటల్లో పెట్టి శాంతమ్మ అన్ని విషయాలూ కూపీ లాగింది

ఆ అమ్మాయి పేరు పద్మావతి యం ఏ చదివింది ఎన్నో సంబంధాలు వచ్చాయి అన్నిటినీ పద్మావతి తిరస్కరించింది ఎందుకో కారణం మాత్రం చెప్పదు వయసు పెరిగే కొద్దీ వచ్చే సంబంధాల సంఖ్య గూడా తగ్గిపోయింది

దిక్కుతోచక ఆ తలిదండ్రులు కూతురుతో కలిసి కలియుగ వైకుంఠానికి బయలుదేరారు

నడక సాగుతోంది

పద్మావతి అతిలోక సౌందర్యం శ్రీనివాస్‌ను ఆకర్షించలేదు

శ్రీనివాస్‌కి అక్కడ అంతటా తిరువేంకట నాథుడే కనబడుతున్నాడు అతడు అప్రయత్నంగా అన్నమయ్య కృతులను పారవశ్యంతో మధురంగా గానం చేస్తున్నాడు

పద్మావతి ఆశ్చర్యంతో శ్రీనివాస్ వైపు చూచింది

అతడి భక్తి పారవశ్యం గాంచి చకితురాలైంది ఈ రోజుల్లో, అందులో విద్యావంతుల్లో ఇంతటి ఏకాగ్రతా, దీక్షా, భక్తీ ఎక్కడో గాని కనిపించవు

ఇప్పుడిక్కడున్న వ్యక్తి స్వామిని కీర్తిస్తూ పరవశత్వం చెందుతున్నాడు ప్రక్కనే తను ఉన్నా కన్నెత్తి కూడా చూడటం లేదు లోకంలో ఇంకా సచ్ఛీలం బ్రతికే వుంది

పద్మావతి అతణ్ణి లోలోన ప్రశంసిస్తూ నడక సాగించింది

రెండు కుటుంబాల వారూ ఒక కాటేజీలో నే ప్రక్క ప్రక్క భాగాలలో బస చేశారు

కాలకృత్యాలు తీర్చుకొని కల్యాణ కట్టకు బయలుదేరారు

శ్రీనివాస్ తల వంచుకొని పీట మీద కూర్చున్నాడు కత్తి తల మీద కదులుతోంది

మిగిలిన అహంకారం వెంట్రుకల రూపంలో వదిలిపోతోంది పరపరమనే శబ్దం సన్నగా వినబడుతోంది అక్కడక్కడా కత్తి తెగి రక్తం చిందుతోంది

శ్రీనివాస్‌కి ఏమీ బాధ అనిపించడం లేదు ఆతని మనసంతా వేంకటేశుని చరణారవిందాలే నిండి ఉన్నాయి

కొంచెం పెద్దగా మాటలు వినబడటంతో అతని ధ్యాన నిష్ఠ భగ్నమైంది కళ్ళు విప్పి చూశాడు

ప్రక్క పీట మీద ఇందాక తమ వెంట వచ్చిన యువతి కూర్చొని ఉంది ఆమెను వాళ్ళమ్మా నాన్నా వారిస్తున్నారు

నా మాట వినవే తల్లీ! ఇంకోసారి ఎప్పుడైనా తలనీలాలు ఇద్దువు గాని లేవే!

కాదమ్మా! ఇప్పుడే ఇవ్వాలి!

పద్మా! పెళ్ళి కావలసిన పిల్లవు! ఇలా మొండి కేస్తే ఎలాగమ్మా? తండ్రి బ్రతిమిలాడుతున్నాడు

తప్పేమిటి నాన్నా? తిరుపతి వచ్చాం! తలనీలా లిస్తున్నాం!

ఆడపిల్లవు గదే! తల్లి అన్నది

ఆడపిల్లయితే ఏమిటి? తల వెండ్రుకలు చూచి పెండ్లి చేసుకునే వాడు ఏం మనిషమ్మా?

శ్రీనివాస్ వదనంలో చిరుదరహాసం మెరిసింది మొదటిసారిగా అతడు ఆమెను పరిశీలనగా చూశాడు ఆమెలో దివ్య సౌందర్యాన్ని గాంచాడు

కూతురిని ఒప్పించలేక ఆమె తలిదండ్రులు మౌనం వహించారు

తెగబారెడు పొడవున్న పద్మావతి శిరోజాలు తెగి నేలబడుతున్నాయి ఆమె తల పైభాగం ఇప్పుడు ఎరుపు పసుపు ఆకుపచ్చ రంగులతో బొప్పాయి పండులా ఆకర్షణీయంగా వుంది

శ్రీనివాస్ రెప్పపాటు లేకుండా స్వామికి తలనీలాలు సమర్పించిన ఆ దివ్యసుందరి వైపే చూస్తున్నాడు

సుబ్బారాయుడు ఆశ్చర్యపడ్డాడు

శాంతమ్మ మనసులో ఆశలు మోసులెత్తాయి

మీ పని పూర్తయింది ఇక లేవండి క్షుర కర్మ పూర్తి చేసిన వ్యక్తి శ్రీనివాస్‌తో అన్నాడు శ్రీనివాస్ ఉలిక్కిపడి తలిదండ్రుల వైపు చూశాడు

వాళ్ళు నవ్వు ముఖాలతో కుమారుడి మనస్సును అర్థం చేసుకుంటూ తల ఊపారు

శ్రీనివాస్ పద్మావతి వైపు చూశాడు

పద్మావతి శ్రీనివాస్ తలను భక్తితో చూస్తోంది

శ్రీనివాస్ కళ్ళు సరే అంటున్నాయి పద్మావతి సిగ్గుతో తల దించుకుంది

పూర్తయిందని చెప్పినా పీటమీంచి అతడు ఎందుకు లేవడం లేదో తలవెండ్రుకలు తీసినతనికి ఇప్పుడు గాని అర్థం కాలేదు

పద్మావతి తలిదండ్రులకు ఆ కల్యాణ కట్ట పెళ్ళి పందిరిలాగా భాసించింది

శ్రీనివాస్ తలిదండ్రులకు తమ కుమారుడి తల వెండ్రుకలు తీసిన నాయీబ్రాహ్మణుడే పురోహితుడు లాగా కనబడ్డాడు

పద్మావతి పీట మీద నుంచి లేవబోతూ వుంటే శ్రీనివాస్ చేయి అందించాడు

ఆ కరగ్రహణ సమయాన శ్రీవేంకటేశుని లీలలను ధ్వనింప చేస్తూ ఆనంద నిలయంలో గంటలు అదే పనిగా మ్రోగాయి □